'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 'ది సైన్స్ ఆఫ్ స్లీప్' అనే అంశంపై ప్రముఖ లైఫ్ కోచ్, మెడిటేషన్ గైడ్ బి.కె. డాక్టర్ స్వామినాథన్ ఉపన్యాసం ఇస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

28న 'సంకల్ప్ దివాస్–2023

గచ్చిబౌలి: మాదాపూర్‌లోని శిల్పారామంలోని సాంప్రదాయవేదికపై ఈ నెల 28వ తేదీన 'సంకల్ప్‌దివాస్–2023' నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలలో ఒకటైన సుచిర్ ఇండియా సీఎస్ఆర్ విభాగమైన సుచిత ఇండియా ఫౌండేషన్ ఏర్పాటు చేసిన సంకల్ప్ కిరణ్ పురస్కార్ అవార్డు, మానవతావాది లయన్ డాక్టర్ వై కిరణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పద్మవిభూషణ్ మేరీకోమ్‌కు అవార్డు అందించి సత్కరిస్తామని సుచిర్ ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వై కిరణ్ తెలిపారు.

సిద్ధేంద్రయోగి ఆరాధనోత్సవాలు



మాదాపూర్: శిల్పారామంలో సిద్ధేంద్రయోగి ఆరాధనోత్సవాలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. భరతవేద ఆర్ట్స్ అసోసియేషన్ గురువు డాక్టర్ శ్రీనివాస వరప్రసాద్ శిష్యులతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్రాంత అచార్యులు డాక్టర్ భాగవతుల సేతురాం పాల్గొన్నారు. కళాకారులు నటేశకౌతం, జావళి, మూషికవాహన, రామాయణశబ్దం, అన్నమాచార్య కీర్తనలు, రామదాసు కీర్తనలు తదితర అంశాలను ప్రదర్శించి సందర్శకులను అలరించారు. కళాకారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

వంద రోజుల్లో పార్టీ పథకాలను అమలు చేస్తాం...

కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు పథకాలను వంద రోజుల్లో అమలు చేస్తామని ఆ పార్టీ శేరిలింగంపల్లి అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన వివేకానందనగర్ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ముందుగా శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం సీనియర్ నాయకుడు ముక్కా రూపానందరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం సుమిత్రానగర్‌లోని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో పూజలో పాల్గొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందనే ధీమా వ్యక్తం చేశారు.

ఎస్సీ వర్గీకరణపై చట్టం చేయాలి

మాదిగ మేధావుల ఫోరం డిమాండ్

సుందరయ్య విజ్ఞాన కేంద్ర: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ చట్టం చేసి వెంటనే అమలు చేయాలని మాదిగల మేధావుల ఫోరం డిమాండ్ చేసింది. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాదిగ మేధావుల ఫోరం ఆధ్వరంయలో ఎస్సీ వర్గీకరణ పరిష్కారం అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ మాదిగ దండోరా ఉద్యమం ఎవరో ఒకరి ఉద్యమం కాదని ప్రతి మాదిగ, మాదిగ ఉపకులాలు చేసిన ఉద్యమం అన్నారు. 30 ఏళ్లుగా ఎందరో తమ జీవితాలను ఫణంగా పెట్టారన్నారు. ఉద్యమాన్ని ఒక పార్టీకి తాకట్టు పెట్టడం అంటే మాదిగల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని అన్నారు. మోదీ వర్గీకరణ కోసం కమిటీ వేస్తాననడం మరోసారి మాదిగలను మోసం చేసేందుకేనని ఆరోపించారు. పదేళ్లుగా అధికారంలో ఉంటూ అనేక చట్టాలను రాత్రికి రాత్రే చేసిన మోదీ ఎస్సీ వర్గీకరణ చేయలేదా అని ప్రశ్నించారు. వర్గీకరణ సాధన కోసం ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ పసునూరి రవీందర్ మాట్లాడుతూ మాదిగల ఆత్మగౌరవాన్ని మందకృష్ణ మాదిగ బీజేపీకి తాకట్టు పెట్టారని ఆరోపించారు. పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశం మాదిగలదా లేదా మోదీదా అని ప్రశ్నించారు. మందకృష్ణ మీటింగ్‌కు బీజేపీ కార్యకర్తలే ఎక్కువ వచ్చారని ఎద్దేవా చేశారు. ఎమ్మార్పీఎస్‌ను ఛీ కొట్టే పరిస్థితిని తీసుకు రావద్దని హితవుపలికారు. మందకృష్ణను ప్రశ్నించకపోతే హోల్‌సెల్‌గా మాదిగలను అమ్మేస్తాడని, మోదీని తిడితే మందకృష్ణకు ఎందుకు బాధకలుగుతుందో అర్థం కావడం లేదన్నారు.

మద్యపాన నిషేధం అమలు చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్ర: రాష్ట్రంలో మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని ఎంవీఎఫ్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నెట్‌వర్క్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ (ఎన్‌పీసీఆర్) ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ, సమస్యలు, సవాళ్లు అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్.వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మద్యం వల్ల వచ్చే రూ.35 వేల కోట్ల కోసం ప్రభుత్వాలు ప్రజలను అంధకారంలోకి నెట్టి వేస్తున్నాయన్నారు. ఎవరు అధికారంలోకి వచ్చినా మద్యం మీద ఆధారపడుతూ పేద ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. పిల్లల భవిష్యత్తును కాలరాస్తున్నారని బాలల హక్కుల ఉల్లంఘన జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు చట్టబద్ధ బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నాలు ప్రభుత్వాలు చేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

నేడు హైకోర్టు మాజీ న్యాయమూర్తులకు సన్మానం

కాచిగూడ: జాతీయ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తెలంగాణ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 25న బొగ్గులకుంటలోని సారస్వత పరిషత్ హాల్‌లో హైకోర్టులో పదవీ విరమణ చేసిన ప్రముఖ న్యాయమూర్తులు జస్టిస్ వామన్‌రావు, జస్టిస్ జి.చంద్రయ్య, జస్టిస్ యం.వెంకటేశ్వర్ రెడ్డి, జస్టిస్ పిఎస్ నారాయణ, జస్టిస్ ఏ.రాజశేఖర్ రెడ్డిలకు అభినందన సత్కార సభను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.రాజ్‌నారాయణ ముదిరాజ్ తెలిపారు.

మాతృభాషపై పట్టు సాధించాలి

కాచిగూడ: మాతృభాషలో ప్రావీణ్యం సాధిస్తేనే ఇతర భాషలను సులువుగా ఆకలింపు చేసుకోవచ్చునని ఉస్మానియా యూనివర్సిటీ సంస్కృత విభాగం అధిపతి డాక్టర్ శ్రీవిద్యానంద ఆర్య అన్నారు. శుక్రవారం నారాయణగూడలోని భవన్స్ న్యూ సైన్స్ కళాశాలలో భాషా దినోత్సవ వేడుకలను ప్రిన్సిపాల్ పేరాల కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాషను మర్చిపోతే సంస్కృతిని మర్చిపోయినట్లే అన్నారు. భాష భావ వ్యక్తీకరణకు మాధ్యమమని భాష లేనిదే మన సంస్కృతిని భావితరాలకు అందించడం వీలుకాదన్నారు. ప్రతి ఒక్కరూ మాతృ భాషలో మాట్లాడాలని సూచించారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలు భాష ప్రాముఖ్యతను అర్థమయ్యే రీతిలో వివరించారు.

ఆలోచింపజేసిన వైజ్ఞానిక అంశాలు

పంజగుట్ట: విల్లామేరీ మహిళా కాలేజీలో శుక్రవారం సైన్స్, గణితం ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఎగ్జిబిషన్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎమ్ఈసీ విద్యార్థినులు పాల్గొన్నారు. ఎనిమిది మంది విద్యార్థినులు ఒక బ్యాచ్‌గా ఏర్పడి చంద్రయాన్, డ్రోన్, హార్ట్‌కు బ్లడ్ ఎలా సర్క్యులేట్ అవుతుంది, మైక్రోవేవ్ లాంటి 30 మోడల్స్ తయారు చేసి ప్రదర్శించారు. ఆయా వైజ్ఞానిక అంశాలు సందర్శకులను అలరించి, ఆలోచింజేశాయి. ఉత్తమ ప్రదర్శనలకు న్యాయనిర్ణేతలు ఉత్తమ మొడల్‌ను ఎంపికచేసి గోల్డ్, సిల్వర్ మెడల్స్, ప్రశంస పత్రాలను అందజేశారు. విద్యార్థినులు చేసిన డ్యాన్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కాంగ్రెస్ గారడీలు నమ్మొద్దు..

కూకట్‌పల్లి బీఆర్ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు, బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ శిరీష బాబూరావుతో కలిసి శుక్రవారం బాలాజీనగర్ డివిజన్‌లో ప్రజా ఆశీర్వాద ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 60 ఏళ్లుగా చేయలేని పనులు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత చేసి చూపించామన్నారు. ఇప్పుడు ఏదో వచ్చి అది చేస్తాం... ఇది చేస్తామంటే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కాంగ్రెస్ పాలించే రాష్ట్రాల్లో ఎక్కడైనా రూ.2వేల ఫించన్ ఇస్తున్నారా అని ప్రశ్నించారు. అదే విధంగా 24 గంటల విద్యుత్ ఇస్తున్నారా అని సవాల్ విసిరారు.

జాతీయ పురస్కారాలే నిదర్శనం..

◆ ఎన్నో అభివృద్ధి,సంక్షేమ పథకాలతో ముఖ్యమంతిర కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టారని అందుకు నిదర్శనమే ఇటీవల జాతీయ స్థాయిలో రాష్ట్రానికి వస్తున్న పురస్కారాలు చూసి తెలుసుకోవాలన్నారు. నేడు తెలంగాణ రాష్ట్రం దేశానికి అన్నం పెట్టే స్థితిలోకి చేరుకుందన్నారు. ఒకప్పుడు బీడు భూములతో, ఎండిన చెరువులతో వలస ప్రజలతో తెలంగాణ రాష్ట్రం అల్లాడిపోయేదన్నారు. నేడు పచ్చని పంట పొలాలతో నిండుకుండల్లా చెరువులతో కళకళలాడుతున్న తెలంగాణను చూస్తున్నామన్నారు.

బాలాజీనగర్ డివిజన్‌లో ఎన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం..

◆ బాలాజీనగర్ డివిజన్‌లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో ఈ పదేళ్ల కాలంలో ముందుకు వెళ్లామన్నారు. చెరువుల సుందరీకరణలో భాగంగా రంగధాముని చెరువును అత్యద్భుతంగా తీర్చిదిద్దుకున్నామని తెలిపారు. త్వరలో మిగతా పనులు కూడా పూర్తి చేసి అన్ని చెరువులను సుందరీకరిస్తామని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారులకు ప్రత్యేకమైన పార్కులు నిర్మించామని తెలిపారు. గల్లీ గల్లీకి సీసీ రోడ్లతో ఆదర్శ డివిజన్‌గా మార్చబోతున్నామని పేర్కొన్నారు. ఇల్లే ఇదే అభివృద్ధి కొనసాగాలంటే ముఖ్యమంత్రి కేసీఆర్‌నే గెలిపించుకోవాలని కోరారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారానికి ముందు పూజలు చేస్తున్న కృష్ణారావు





బాలాజీనగర్ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ శిరీష బాబూరావు

ఎమ్మెల్యే సతీమణి ప్రచారం..

మూసాపేట డివిజన్‌లో కూకట్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాధవరం కృష్ణారావుకు మద్దతుగా ఆయన సతీమణి లక్ష్మీబాయి, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్‌తో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. రానున్న ఎన్నికల్లో మాధవరం కృష్ణారావు కారు గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



మూసాపేటలో ప్రచారం చేస్తున్న మాధవరం కృష్ణారావు సతీమణి లక్ష్మీబాయి

ఎమ్మెల్యే కుమారుడు ప్రచారం..

అల్లాపూర్ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి మాధవరం సందీప్‌రావు గణేష్‌నగర్, రామారావునగర్‌లలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. ఎంత అభివృద్ధి జరిగిందో తెలుసుకుని మాధవరం కృష్ణారావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.



అల్లాపూర్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కృష్ణారావు కుమారుడు సందీప్‌రావు

కృష్ణారావుకు మద్దతుగా కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ప్రచారం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు కూకట్‌పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు గెలుపే లక్ష్యంగా శుక్రవారం ధర్మారెడ్డి ఫేజ్ 2, ఎస్ఎస్ కాలనీ, వసంత్‌నగర్, సర్దార్ పటేల్‌నగర్, భగత్ సింగ్ నగర్లలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో మాధవరం కృష్ణారావు బ్యాలెట్ నం.2 మీద మీ ఓటు వేయాలని కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఎంతో సురక్షితంగా హైదరాబాద్ మహానగరాన్ని తీర్చిదిద్ది పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చి ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించిన సంస్థలు తీసుకొచ్చిన మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ ఎన్నికల్లో మాధవరం కృష్ణారావుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే..

కూకట్‌పల్లి అభ్యర్థి బండి రమేష్



అల్లాపూర్ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న బండి రమేష్





బాలానగర్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న సత్యం శ్రీరంగం, పుష్పారెడ్డి

కూకట్‌పల్లి: నియోజకవర్గంలోని అల్లాపూర్ డివిజన్‌లో కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాస్వామ్య దేశంలో అధికారం ఎవరి సొత్తు కాదని, అధికారాన్ని అడ్డుపెట్టుకొని కొందరు బలవంతులు ప్రజలను ఇబ్బందులు పెడుతూ అక్రమ కేసులు పెట్టడం చాలా బాధాకరమన్నారు. చట్టాన్ని ఉపయోగించి అధికారులు దుర్వినియోగం చేస్తే భవిష్యత్‌లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రజా బలం ముందు ధన బలం ఎంత అని ప్రశ్నించారు. ఈ ఎన్నికలు న్యాయానికి, అన్యాయానికి మధ్య జరుగుతున్న యుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సయ్యద్ బాబా, రేష్మా, జబ్బార్ ఖాన్, మొహిజ్, రాహుల్, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి: బాలానగర్ డివిజన్ సాయినగర్, వినాయక్‌నగర్, గడ్డి చేను ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎడ్ల మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ఎన్నికల ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రచారంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, మాజీ కౌన్సిలర్ సంజీవ్, ప్రసన్న కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీదే విజయం

భారీ మెజార్టీతో గెలిపించాలి

భాగ్యనగర్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్‌యస్ పార్టీ అభ్యర్థి అరెకపూడి గాంధీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ శుక్రవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, అరెకపూడి గాంధీ సతీమణి శ్యామలాదేవితో ప్రచారంలో పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని విజయనగర్ కాలనీ, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు. బీఆర్‌యస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల కమిటి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వేల కోట్లతో అభివృద్ధి చేశాం

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్, కూకట్‌పల్లి డివిజన్‌లోని బాలకృష్ణ నగర్, రామరావునగర్, పాపారాయుడునగర్ కాలనీవాసులతో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ శేరిలింగంపల్లి అభ్యర్థి గాంధీ శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దే క్రమంలో భాగంగా ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు, మౌలిక వసతుల కల్పనకు కృషి చేశామన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణరావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన, బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి

జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి బీజేపీ, జనసేన పార్టీ బూత్ కమిటీ, సీనియర్ నాయకులతో శుక్రవారం సమీక్షా సమావేశం మియాపూర్‌లోని నరేన్ గార్డెన్స్‌లో జరిగింది. ఈ సమావేశానికి జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్, కేంద్ర మాజీ మంత్రి ప్రకాష్ జవదేకర్, జనసేన పార్టీ ప్యాక్ చైర్మన్ నాదెండ్ల మనోహర్, కూకట్‌పల్లి జనసేన అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్, శేరిలింగంపల్లి బీజేపీ అభ్యర్థి రవికుమార్ యాదవ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.... జనసేన అనేది రీజినల్ పార్టీ కాదని.. ప్రాంతీయ ధోరణితో పార్టీ పెట్టలేదన్నారు. జాతీయ సమగ్రత కోసం పార్టీ పెట్టానన్నారు. ఏ రోజు కూడా ప్రాంతీయతని విస్మరించని జాతీయ వాదులు జనసేసైనికులని అన్నారు. సినిమాల్లో నటించేటప్పుడు కశ్మీర్ వెళ్లేవాడినని అక్కడ కశ్మీర్ పండితల బాధలు స్వయంగా చూశానని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి ఒక సమర్థుడైన నాయకుడు కాబట్టే కశ్మీర్‌లో శాంతి నెలకొల్పారన్నారు. రానున్న ఎన్నికల్లో గాజుగ్లాసు గుర్తుకు ఓటు వేసి కూకట్‌పల్లి నుంచి ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌ను, కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి శేరిలింగంపల్లి బీజేపీ అభ్యర్థి రవికుమార్ యాదవ్‌లకు అత్యంత మెజార్టీ వచ్చేలా గెలిపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్‌జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాలహరీష్ రెడ్డి, మాధవరం కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు,సాగర్, కళ్యాణం శ్రీనివాసరావు, బొలిశెట్టి శ్రీనివాసరావు, మహేందర్‌రెడ్డి, అదావనీ సూర్యారావు, సూర్య ప్రకాష్, రాజలింగం, మూసాపేట కార్పొరేటర్ మహేందర్, నాయకులు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి జనసేన పార్టీ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌తో పవన్‌కళ్యాణ్

షా రోడ్ షో









శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రవికుమార్ యాదవ్‌కు మద్దతుగా శుక్రవారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నిజాంపేటలో నిర్వహించిన రోడ్ షోలో బీజేపీ, జనసేన కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కళాకారులు, వాయిద్యకారులు, బోనాలతో మహిళలు అమిత్ షాకు ఘన స్వాగతం పలికారు. అమిత్ షా రోడ్ షోలో టీడీపీ జెండాలు ప్రత్యక్షం కావటం కొసమెరుపు. ఈ కార్యక్రమంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర బీజేపీ నేతలు పాల్గొన్నారు.

– భాగ్యనగర్‌కాలనీ

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల సరళిపై ఆరా

సాక్షి, మేడ్చల్ జిల్లా: కలెక్టరేట్ సమదాయంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఓట్ల సరళిని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ గౌతమ్, ఎన్నికల సాధారణ అబ్జర్వర్ ఎస్.కె.జైన్‌తో కలిసి పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల విషయంలో ఎలాంటి పొరపాట్లు చేయవద్దని, ఓటు వేయడానికి వచ్చే ప్రతి ఓటరుకి గుర్తింపు కార్డు ఉండాలని అన్నారు. ఫారం 13ఏ, 13బి, 13సిలను సరిచూసుకోవాలని, పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ గురించి, రాజకీయ పార్టీలకు, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు ముందే సమాచారం ఇచ్చామని, ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న ప్రతి ఉద్యోగి తన విలువైన ఓటును వినియోగించాలని, ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని, పోస్టల్ బ్యాలెట్ల కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమ ఓటును వినియోగించుకోవాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడానికి వీలుగా ఆయా నియోజకవర్గాలకు చెందిన ఫెలిటిటేషన్ కేంద్రాలు ఇక్కడ ఏర్పాటు చేశామని, సిబ్బంది విధిగా ఓటు హక్కును వినియోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో పోస్టల్ బ్యాలెట్ల నోడల్ అధికారి వంశీ మోహన్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తయిన సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ

అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో భాగంగా రిజర్వ్‌లో ఉన్న బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ కట్టుదిట్టంగా పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో 47 రిజర్వ్ బ్యాలెట్ యూనిట్లు, 155 కంట్రోల్ యూనిట్లు, 20 వీవీపాట్ల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియను ఆయన చేపట్టారు. ఇప్పటికే అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఈవీఎంల తరలింపు పూర్తయ్యిందని తెలిపారు.

ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ కార్యశాల

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్‌పై రెండు రోజుల కార్యశాలను నిర్వహించారు. కార్యశాల సమన్వయకర్త డా. జి. అమరావతి మాట్లాడుతూ.. విద్యార్థులకు విత్త సంస్థలు, విత్త పరికరాలు, మదుపు చేయడానికి గల వివిధ అవకాశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించటానికి సెబి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్‌ల ఉమ్మడి సహకారంతో రెండు రోజుల పాటు కార్యశాలను నిర్వహించామన్నారు.

◆ ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తగా డా. షేక్ మసూద్ అహ్మద్ వివిధ విత్త సంస్థలపే షేర్ల అమ్మకాలు, కొనుగోళ్లు ఎలా చేయాలో వివరించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు డిగ్రీ తర్వాత ఉద్యోగ వకాశాలను అందిపుచ్చుకోవడంలో ఎంతగానో సహకరిస్తాయని కళాశాల ప్రిన్సిపాల్ డా. అలివేలు మంగమ్మ అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. బి. భవాని, వాణిజ్య విభాగ ఆచార్యులు ఆర్. కరుణ, ఎన్. సురేష్, డా. కె. సాలయ్య, డా. కె. శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. అలివేలు మంగమ్మ